# రంభతో ఓ రాత్రి

ఎల్చూరి నారాయణ రావ్



అర్ధరాత్రి పదకొండు గంటలు దాటుతోంది. ఉరుముల మెరుపులతో కుంభవృష్టి కురుస్తూ ప్రకృతిని గజగజలాడిస్తోంది. ఒక ప్రక్కగా చక్కగామన్న యింటి కిటికీ తలుపు లాటరీలో లక్షరూపాయలొచ్చిన వాడి గుండెలా టపటపామని గాలికి కొట్టుకుంటూంది.

కిటికీని బలవంతాన లాగి కొక్కెం పెడుతూ "ఒరేయ్ నవగ్రహం! ఏంటా దీర్ఘాలోచన. గదిలో మరో మనిషున్నాడన్న జ్ఞానం వుందా అసలు" అన్నాడు గుర్నాధం చేతి కందిన పేక్కను నవగ్రహం ముందికి జల్లుతూ.

"హూ....! యిన్నాళ్ళకు జీవితం అంటే అర్థం యేమిటోనని బోధపడింది" మన పోజులో వెట్టార్చుతూ అన్నాడు నవగ్రహం.

"బుద్ధుడికి అదేదో చెట్టుకింద జ్ఞానోదయమైనట్లు. నీకీ అద్దె కొంపలో అద్భుత విషయాలు అవగాహన అవుతున్నాయి. ఇంతకీ జీవితం అంటే ఏవిట్రా?" కుతూహలం చూపాడు గుర్నాధం.

"జీవితమంటే జీవించడమే. జీవించడమే జీవితం" వేదాంతి వేషంలో అన్నాడు నవగ్రహం.

బ్రహ్మాండంగా ఉరుము వురిమి ఎక్కడో పడిందో పిడుగు. దెబ్బకి భూమంతా కంపించింది.

"ఇంతకీ ఈ అకాల వర్షానికి హేతువు యిదన్నమాట. నువ్విలా అద్భుత మహాస్యాల్ని ఛేధించుకుని పోతూవుంటే, కాస్సేపటికి ప్రళయంవంటి ఉపద్రవం సంభవిస్తుంది నవగ్రహం. ఆ పై నీ యిష్టం."

"సృష్టి రహస్యాలు నీకర్థంకావులే!" జాలిపడ్డాడు నవగ్రహం.

"పీడాపోయిందిగానీ, నువ్వేం బాధపడకు. అయినా యిలాంటి వర్షంలో వేదాంతాల రాద్ధాంతాలేవిటోయ్. విస్కీ-రాజుల క్యాబరే హుస్కీ వేస్తే యెంత బావుంటుంది. కనీసం తెలుగువాడికుండే కళాహృదయమన్నా లేకుండాపోయిందేం నీకు?" గుర్నాధం పత్రికమీద తెలుగు తారల్ని చూస్తూ అన్నాడు.


"అది ఎక్కడికీ పోలేదు. ఏ మేనకకో కానుకగా యిచ్చినట్టు గుర్తు. అయినా ఈ ఆడవాళ్ళు...." నవగ్రహం మాటల్నిమధ్యలో ఖండిస్తూ, యిలా అన్నాడు.

"సర్లే! మన ఆడవాళ్ళలో ఏముంది గొప్ప! నలభై యేళ్ళు దాటాయంటే నళిని కాస్త నళినమ్మ అయి ఆ తర్వాత నాయనమ్మవుతుంది. కానీ, ఆ దేవతల్ని చూడు. అందులోనూ ఆ రంభా...ఊర్వశీలను చూడు యెన్నేళ్ళు గడిచినా తరగని అందం, పెరగని వయసు వాళ్ళది. మొన్న కలలో కాబోలు చూసాను. ఓహ్! ఆ నిగ నిగలు, తళతళలు. ఆహా! అమృతాన్ని కనిపెట్టిన అపూర్వ సైంటిస్టులు వాళ్ళు. మన వాళ్ళూ వున్నారు. ఎందుకూ? వెధవది విస్కీ, బ్రాందీలు కు స్త్రీలుబట్టి కనిపెట్టారు. ఆ మధ్య ఎవరో నాయకుడు స్వయం కృషితో అద్భుతమైన మధుపానాన్ని కనిపెట్టారు. ఆ విస్కీలు బ్రాందీలు తాగినంత సేపే మజా.... తెల్లారితే తలనెప్పులు! రకరకాల వికారాలు-ధూత్!" ఆయాసంతో ఆగాడు గుర్నాధం.

"ఆహా! ఈ చలిలో నులివెచ్చని రంభ కౌగిలిలో నున్న గిలి తలుచుకుంటే ఈ చలి వణుకు కాకుండా, మరో వణుకు కూడా పుట్టుకొస్తుందిరోయ్. వుండు నా దగ్గరో పాత పంచాంగం వున్నట్టుంది. అందులో "రంభ సాధనం" గురించి ఈశ్వరుడు పార్వతికి చెప్పినట్లు వుంది. ఆ వ్రతం సలిపామంటే రంభ మనకు వశ్యమవుతుంది. రంభ దొరికితే అమృతం దానంతట అదే వస్తుంది. ట్రంకు పెట్టలు గాలించడం మొదలుపెట్టాడు నవగ్రహం.

"మన 'ఓటర్స్' లాగా యేది చెప్పినా అది నమ్మేయడమేనా, ఫూల్! అదంతా పుస్తకం అమ్ముడుకోసం యేడ్చిన యేడ్పు- అసలు రంభ పొందు లభించాలంటే ఇహలోకంలో మంచి పనులు చేయాలి. అప్పుడు స్వర్గంలో లభిస్తుంది. కానీ, యింత వరకు మనం ఒక్క మంచి పనైనా చేసినట్లు, బుట్టల్లోగానీ, డైరీలోగానీ దాఖలాలు లేవే!" వాపోయాడు గుర్నాధం.

"అయ్యో! ఈ జన్మలో మనం రంభ గాఢ పరిష్వంగానికి నోచుకోమా?" గుండెలు




బాదుకుంటున్నాడు నవగ్రహం.

"ఆహా! ఆ సుందర వదనారవిందాన్ని తిలకించలేని జన్మ ఒక జన్మేనా! ఈ బ్రతుకు వృధా! నవగ్రహం, నా విరహానికి విరుగుడు లేదుగదా?"

బయట వర్షం మరింత పెట్రేగిపోతూంది. దిక్కులు పిక్కటిల్లేలా ఉరుములుగర్జించాయి. ఉధృత ఝంఝామారుతానికి, వీధ తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. నవగ్రహం గుర్నాధం హడలిపోయి వీధి తలుపులుకేసి చూసారు. అద్భుతమైన నీలి కాంతితో మెరుపు నిముషంపాటు మెరిసింది. ఆ వెలుగుల వెల్లువలో ఓ నవయవ్వనజవ్వని, దేవతా వస్త్రాలతో గోచరించింది. నవగ్రహం, గుర్నాధం ఒక్కసారిగా కెవ్వుమని అరిచారు. మరుక్షణం 'మంబా సాంబా'ల తరహాలతో నృత్యం మొదలెట్టి, హైరానా పడిపోతూ ...

"రం....రం .... రం.." తడబాటుగా అంటూ నాలిక కరిచేసుకున్నాడు నవగ్రహం.

"భ..భ..భ.." భరతనాట్య భంగిమలో పూర్తి చేశాడు గుర్నాధం.

"కలలన్నీ పండి, కలకత్తాలో యెండి.. ఛ..ఛ..సమయానికి కవిత్వం కూడా రావడం లేదు. అయ్యో! రంభ..అవును రంభే..నిల బడేవుందే.ఇప్పుడెలా? ఒ..ఒరేయ్ గుండు గుర్నాధం వెధవా, రమ్మని పిలవ్వేరా; మనం ధిక్కరించామని కోపంతో వెళ్ళిపోతుం దేమో?" నవవంకరలు తిరుగుతున్నాడు నవగ్రహం.

గుర్నాధం గొంతు పిసికేసుకుంటూ, "ఆ..ఆ..అదే....రండి....లోనికి రండి.... ఒరేయ్! మన భాష అర్థంకానట్టుంది." అని "అచ్చోట నుండి, ఇచ్చోటకు రండీ. అధో భాగానికి విచ్చేయండి" తెలుగు ఉపయోగిస్తు న్నాడు.

వీళ్ళ ఆర్భాటానికి అచ్చెరువు చెందుతూ ఆహ్లాదకరంగా అలా అలా మందహాసం చేసిందా మందగమన.

నవగ్రహం చేతులు విరిచేసుకుంటూ "హి హి ఎటనుండి, యటచని, యిటకేతిం చితివి ఓ మృగయాక్షి" అన్నాడు అల్లసాని పెద్దన్నను జ్ఞాపకం తెచ్చుకుంటూ.

"నీ శుభనామం బెద్ది? మమ్మిటుల కటా క్షించుటకు కారణం బెద్దియో, అద్దానికి కొద్దిగా ముద్దుగా చెప్పంగదవే ఓ చపలాక్షీ, చకో రాక్షీ" నవగ్రహంకంటె రెండాకులుఎక్కువ చదివేనన్న సంగతి ఋజువు చేస్తూ అన్నాడు గుర్నాధం.

చిన్నగా నవ్వి యిలా అందా అందాల భరిణి.

"పేరు రంభ. అప్సరసను నేను. మేనక, ఊర్వశి, తిలోత్తమలు, మదీయులగు ప్రాణ సఖుల్; అమరపతి అనుంగునెచ్చెలిని. నా యెడ మీకున్న కౌతుకంబెరిగి, యిట వేంచేసి తినో యువక ప్రముఖుల్లారా!"

"అమ్మో! అమ్మో!! రంభే..రంభే.. మన ఊహ నిజమేరోయ్! లేకపోతే యింతందం ఎవరికుంటుంది? ఆహ వెదక బోయిన కాళ్ళు తీగకు ఛ..ఛ..ఆడబోయిన తార్థం ఛి..ఛి యేదీ సరిగ్గా గుర్తుండిచావడం లేదు, ఒరేయ్, ఆ రంభతో యేదన్నా మాట్లా డరా మూగి సన్నాసీ," నవగ్రహం గుర్నా ధాన్ని గట్టిగా పట్టుకుని, కసిగా గిల్లేస్తూ ముందుకు తోసాడు.

"బాబోయ్! ఆ భాషలో యిక మాట్లాడితే శోష వస్తుంది. ప్రక్కింటిలో వున్న మన తెలుగు మాస్టారుని పిలుచుకొస్తానుండు." పరుగెట్టబోయాడు గుర్నాధం.

"వెధవా! పాయసంలో ఈగలాగ ఆయె ందుకు మధ్యన. ఆయన్నిగాని ఖర్మగాలి పిలిచావో 'అమరలోకం, వ్యాకరణ రీతులు' అంటూ ముక్కుపొడుం డబ్బామీద తాళం మొదలెడతాడు. ఛ! నీవల్ల అడ్డమైన వాగుడూ వాగాల్సిన గతి పట్టింది. ముందా తలుపుల్ని మూయ్యవేం? చలికి ప్రాణం పోతూంది. ఆ రంభను చూడు. యింత చలి వేస్తున్నా, తనుమాత్రం ఎంత ధీమాగా నిల బడి వుందో! అదే దేవతల ప్రత్యేకత అంటే. వాళ్ళకి చెమట బట్టదు. చీర మాయదు. ఆహా! ఆ చిన్న కిరీటమూ, వడ్డాణమూ, బులాకీరాయి, అదేంటో, ఆ పేరు గుర్తుకు రావడం లేదు. తెలుగు సరిగ్గా నేర్చుకుంటే ఈ బాధ వుండకపోను కదా! అయ్యో! ఏమిటో అంతా నేనే మాట్లాడేస్తున్నాను. వెధవా! అతిధి మర్యాదలు తెలియవు నీకు.. ఆ..ఆ..రంభా! ఇదిగో ఈ చమరీ సోఫా నముపై సుంత ఆసీనురాలివి కమ్ము!" అని ఊపిరి పీల్చుకుని గర్వంగా గుర్నాధానికేసి చూసాడు నవగ్రహం.

రంభ వయ్యారంగా నడిచొచ్చి, సోఫాలో కూర్చొని, వీళ్లకేసి చూసి చిరునవ్వు చిందించింది.

ఇద్దరి గుండెలు ఝల్లుమన్నాయి. ఏం మాట్లాడాలో ఎలా పలకరించాలో ఎలా పొగిడి బోనస్ మార్కులు కొట్టెయ్యాలో తెలియక సతమతమౌతున్నారు. ఇది వాళ్ళకి అనుకోని అనుభవం.

ఊహించని పరిణామం. ఇంకాస్సేపట్లో తమకి రంభ పొందు లభించబోతుందన్న ఆనందంతో వాళ్లిద్దరి గుండెలు జెట్ వేగంతో కొట్టుకోసాగాయి. యిద్దరిలో, ముందు రంభను పొందే అవకాశంకోసరం, ఆవిడ మెప్పుదలకోసరం, పోటీలు పడి. ముందుగా నవగ్రహం తెగించి, "రంభా! అలనాడు నీవు విశ్వామిత్రుడి తపస్సు విపస్సు (అంటే

చెడగొట్టుట అని తెలుగు మాష్టారు ప్పన గుర్తు!) చేసి దేశానికి చాలా లు చేసావు" అన్నాడు గుర్నాధాన్ని క్క లాగుతూ.

"ఎటులః" విస్మయంతో కళ్లు పా ఆడిస్తూ అడిగింది రంభ.

గర్వంగా కాలర్ సవరించుకుని "అ ను. నీవు తపస్సుమ విపస్సు! చేసినందు నే, నీకు విశ్వామిత్రుడికి శకుంతల జన్మిం ంది. ఆ శకుంతలకూ దుష్యంతుఃకీ భ డు పుట్టెను. ఆ భరతునివల్ల భారత ము పుట్టెను. నీవు అలా చేయకుండిన రత దేశమే లేదుకదా! కావున మా దేశము సదా నీకు ఋణపడి వుండునుగాక" రంభ ప్రక్కకి జరుగుతూ అన్నాడు నవగ్ర ం.

"లెవ్వలికితిరి. నా లీలలన్నీ విశ్వ కల్యాణం కొరకే" రంభ చిద్విలాసం చేసి, నవగ్రహాన్ని మెచ్చుకుంది.

గుర్నాధానికి అరికాలి మంట నె క్కి మధ్యన అంకుశంలా అడ్డుపడి, " రేయ్ వాజమ్మా! విశ్వామిత్రుడి తపస్సు చెడ గొట్టింది మేనకరా..రంభ గాదు." రంభ వైపు తన లౌక్యాన్ని ప్రదర్శిస్తూ అ డు.

"బోడి జంద్రల్ నాలడ్జి నువ్వూనూ. నీ కళ్ల ముందరే కదారా రంభ వొప్పేసుకుంది. మధ్యన సణుగుడేవిటి? నువ్వు జదివిన పుస్త కంలో అచ్చుతప్పులుండి వుంటాయి అయినా పురాణాల్లో మన పిలక శాస్త్రులుగారు రాసిన చిలక పలుకులన్నీ నిజమేనంటావా,పిచ్చోడా" అని గుర్నాధాన్ని నోరు మూయించేసాడు.

గుర్నాధానికి మండుకొస్తుంది. తనకంటే ముందరే నవగ్రహం రంభకు చేరువవుతున్న యధార్థం సహించలేక బోతున్నాడు. తనూ యేమన్నా అనాలి. కానీ ఎలా అనాలి. తెగించి చివరికి.

"రంభా! యింత సొగసుగా ఆ సోఫా నముపై ఆసీనులై నందుకు ధన్యవాదాలు" అన్నాడు.

రంభ పకపకా నవ్వింది. "పూర్ ఫెలో" అన్నట్లు నవగ్రహం చూసి, తిరిగి తను గొంతు సర్దుకోబోయాడు. ఇక సహించలేక గుర్నాధం నవగ్రహాన్ని బలవంతాన కాస్త బలవంతాన పక్కకి లాక్కుపోయి.

"వెధవా! నీ తెలివి గొప్పదే..ఒప్పుకుం టున్నాను. ఇంతకీ మనకు రంభ పొందు ఎలాగు?" ఆతృతగా అడిగాడు.

"అదే నే చూస్తున్నాను. మన పురాణాలు చెప్పినట్టు ఈ రంభ ఏ ఋషి దగ్గరికి వెళ్లినా ఆడుతూ పాడుతూ, కవ్విస్తూ మీద పడు తుంది కదా, మరి యింతవరకూ మన మీద పడదేం?" నవగ్రహం అన్నాడు.

"బహుశా మనమూ తపస్సు చెయ్యాలి కాబోలు" సందేహం వచ్చింది గుర్నాధానికి.

"ఒరేయ్ ఒకవేళ రంభ మన ముందు సిగ్గుపడుతుందేమోరా...పద మనమే ధైర్యం చేద్దాం" అంటూ రంభ దగ్గరకు వెళ్లాడు నవగ్రహం.

"అబలా! నిన్ను కబళించుటకు అలనాడు నరకాసురుడు ప్రయత్నించి, నీ శాప ఫలి తము వలన శ్రీకృష్ణుని చేతిలో మరణించి, మా కందరికీ ఈ దీపావళినాడు పబ్లిక్ హాలీడే యిప్పించితివి. దీపావళి అన్న నీ నామమే ధ్యానమునకు వచ్చును.."

గుర్నాధం అందుకుని "ఈ దీపావళి పర్వదినమున నీ పర్వమును మా కంకిత మొనర్చి మమ్మానందింపజేయుము" పూర్తి చేసాడు.

"ఆగుడు ఆగుడు. నాకు కోపమువచ్చిన" రంభ కోపంతో ఆగింది.


*WITH BEST COMPLIMENTS FROM*

# ADARSH MOTOR STORES

**AHMEDABAD & MEHSANA**

**(GUJARAT)**

★

*Dealers in :*

AUTOMOBILE TYRES, TUBES & ALLIED ITEMS

"నీకు కోపము వచ్చిన అందము హెచ్చును. అందము హెచ్చిన మాకు ముచ్చట హెచ్చును. ముచ్చట హెచ్చిన ముప్పొద్దులు మురిపాల తేలవచ్చును." నవగ్రహం దండకం మొదలెట్టాడు.

"నీ ప్రియుడు నలకూబరుడే వచ్చిన వచ్చుగాక, దేవేంద్రుడు దేబిరిముఖంతో వచ్చిన వచ్చుగాక! నేను నిన్ను కవయుట సత్యము. నిన్ను వీడుట అసత్యము. నా బ్రతుకు నీతోచే నిత్యము".

జ్వరం వచ్చినట్టు పలవరిస్తున్నాడు గుర్నాధం.

రంభ క్రోధావేశంలో కొత్తపోజు పెట్టి, "సురాసుర గరుడ గంధర్వ యక్ష కిన్నెర కింపురుషాదులకయినా సాధ్యంకాని ఈ రంభ, నరాధములయిన మీకు ఈ రంభపొందు అంత సులభంగా అందుతుందా? ఏమి మీ కండకావరము. ఇకనయినా మీ వాచాలతని కట్టిపెట్టి, మీ చాంచల్యానికి క్షమాపణ వేడుకోండి" అని హూంకరించింది.

నవగ్రహం. గుర్నాధం బిత్తరపోయారు. వొక్కడుగు వెనక్కితగ్గి, "ఇదేవిట్రా ఇలా అంటుంది. నాకు తెలిసినంత మటుకూ, మన పురాణ తాతలు చెప్పినంతమటుకు, ఈ రంభ ఎవడి దగ్గరికెళ్ళినా 'దంతధూర్జం ప్రచారం'లా పళ్ళు వెళ్ళబెట్టి వాళ్ళో వాలుతుంది కదా. మరి ఈ తిరకాసేమిటి? అసలిది రంభో కాదోనన్న సందేహం పుట్టుకొస్తుంది నాకు" అన్నాడు నవగ్రహం.

"అందుకే మన తెలుగు మాస్టారుని పిలుస్తానంటే వద్దన్నావు. ఆయనుంటే యీ క్షణంలో అంతా తేలిపోయేది" వాపోయాడు గుర్నాధం.

"వెధవా, నిన్ను చూడగానే తెలుగు మాస్టారుగారి ఏజంటులా వున్నావే. యిందాకటినుండి ఆయన పాటే పాడుతూ రసభంగం చేస్తున్నావు. అసలిది యింతకీ.. రంభే. మననుంచి తప్పించుకోడానికిలా యెత్తు వేసింది. మనం బోల్తా పడ్డానికిగెడ్డం మీసాలు పెంచిన ఋషులనుకుంటూంది కాబోలు. ఏమైనా సరే ఈ రంభను వదలకూడదు." ధైర్యం తెచ్చుకుంటూ ముందడుగు వేసాడు నవగ్రహం.

"శునకవాలమును ఒక్క రీతిగా చేయ కమలగర్భుని వశమే!" అని నిట్టూర్చింది రంభ మిత్రద్వయం తెగువను చూస్తూ.

"భామినీ! యేల మమ్మీ విరహానలంలో భస్మీపటలం చేసెదవు! ఔరా! పురుషుడు తా వలచివచ్చిన చుల్కన కాదే యేరికిన్! ఈ విరహాగ్నిలో మేము క్రుంగి క్రుశించి నశించిన ఆ పాపము నిన్ను చుట్టుకొనదే సుందరాంగి. మమ్మీరీతిన శిక్షించుట తగునే" నవగ్రహం కావ్యాల్ని ఏకరువుపెట్టేస్తున్నాడు.

"మంచిగంధమున్నది. మంచి మంచమున్నది. సముచితముగా మనమీ బొమ్మరింటిలో వలపుల వరదలలో జలక్రీడలాడుదము రమ్ము" అంటూ అందుకున్నాడు గుర్నాధం.

"అపచారము....నాయనా అపచారము.. మీరు నాకు ముని ముని ముని ముని మనవళ్ళు అవుతారు" అన్నది ఆందోళనగా రంభ.

"ఏమిటీ వింత వరస....మేము సరసముగా మాట్లాడుకొద్దీ విరసముగా విర్రవీగుతున్నావు" నవగ్రహం చిరాకు పడ్డాడు.

"నిక్కము నాయనా! భరతుడి పేరుగా వ్యాప్తినొందిన భారతదేశమందు మీరు జన్మించినారు గావున నేను మీకు జే జే జేజేజి నాయనమ్మ వరుసనవుతాను. ఎటులందురా? నా యనుంగు సోదరియైన మేనక యొక్క కూతురు శకుంతలకు జన్మించినవాడే కదా భరతుడు. అట్లు భరతుడు నాకు మనుమడైన, ఆ రాజ్యంలో పుట్టిన మీరు ముని ముని ముని మనుమళ్ళు కారా! ఔరా! కలియుగమున ధర్మమే గతికి వచ్చినది." బొమ్మల్లా నిలబడ్డ మిత్రుల్ని చూసి అన్నది రంభ.

"కట కటా! మా రాజకీయము వలె ఏమి




ఈ అయోమయము! అయిన, నీ వింతకేం యేతెంచితివి. మమ్మిటుల యేడిపించుచుంటివి?" అని గుర్నాధం ఎగిరి పడ్డాడు.

"అది యొక విషాద గాథ" దుఃఖంతో అన్నది రంభ.

"నీ విషాద భంగిమ చూసిన నాకు కషాయము తాగినట్లున్నది అదియేదో త్వరగా నుడువుము" నవగ్రహం అడిగాడు.

"పూర్వం త్రేతాయుగంలో నేనూ, నలకూబరుడూ ప్రేయసీ ప్రియులము. ఇపుడు మీరు నివసించే ఈ గృహము అపుడొక నవకుసుమ పరిమళభరితమైన చక్కటి పొదరిల్లు. ఒకనాడు మేమిరువురమూ కేళీవిలాసములో దోలలాడుతుండగా, అచటి కరుదెంచిన దేవేంద్రుని చూడలేకపోతిని. నా నిర్లక్ష్యమును సహించక నన్ను శపించెను. పిదప నలకూబరుని వియోగము సహించక శాపవిముక్తికై ప్రార్థించితిని. అప్పుడు అమరపతి శాంతించి, "ఏ చోటునందు నన్ను నీ నిర్లక్ష్యవైఖరితో చూచితివో, అదే చోటునందు కలియుగమున సిద్ధార్థనామ దీపావళి రాత్రంతయు గడిపిన శాప విమోచనము గలుగును" అని అభయం యిచ్చినాడు. నేటితో నా శాప ఫలితం పూర్తవుతుంది" అన్నది రంభ కిటికీనుండి సూర్యుడు యింకా ఎప్పుడు ఉదయిస్తాడాని చూస్తూ.

నవగ్రహం మండి పడుతూ "మరియింతకు మునుపు మాపై కరుణ కలిగి వచ్చితినంటివి గదే! ఇటుల అనృత మాడవచ్చునే అబద్ధాల కుక్షీ!" అరిచినంత పని చేసాడు.

గుర్నాధం అప్పుడే శోష వచ్చే స్టేజి వచ్చేసాడు. రంభ చక్కగా చిద్విలాసం చేస్తూ, "వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణ మాన విత్త భంగమందు; చకిత గోకులాగ్ర జన్మరక్షణందు బొంకవచ్చు, నఘము దొంద దధిప".

అని వినూత్న కాంతి పుంజంతో అదృశ్యమైంది.

భళ్ళున తెల్లారి, కిటికీనుండి సూర్య కిరణాలు వాడిగా నవగ్రహాన్ని తాకగానే కుప్పలా కూలిపోయాడు.